క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న నాయకులు

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని స్టేషన్ తిమ్మాపూర్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థానిక నాయకులు ఆదివారం భూమిపూజ చేశారు. వస్పుల మహేందర్ సొంతంగా స్థలాన్ని కొనుగోలు చేసి అక్కడ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విగ్రహ ఏర్పాటుకు సహకరించిన 3వ వార్డు కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. రాజకీయాలకు అతీతంగా త్వరలో విగ్రహ ప్రతిష్ఠ చేపట్టనున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కోస్గి శ్రీనివాస్, రమాదేవి, సుధాకర్, వెంకటేశ్, సురేష్, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం



రేవంత్‌రెడ్డిని సత్కరిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

కొత్తూరు: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి మండలంలోని తిమ్మాపూర్ వద్ద షాద్‌నగర్ నియోజకవర్గ నాయకులు శంకర్, శ్రీనివాస్‌గౌడ్‌లు వేర్వేరుగా స్వాగతం పలికారు. మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్న నిరుద్యోగ సదస్సుకు వెళ్తున్న తమ నేతకు కార్యకర్తలతో కలిసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలో భారీ ఎత్తున బైక్ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి, బాబార్‌ఖాన్, నర్సింహాగౌడ్ పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం



నవీన్‌కి కరపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

నందిగామ: కొందుర్గు మండలం రేగడి చిల్కమర్రిలో మైసమ్మ ఆలయ నిర్మాణానికి మహబూబ్‌నగర్ జిల్లా మాజీ జెడ్పీవైస్ చైర్మన్ నాగరకుంట నవీన్‌రెడ్డి ఆదివారం లక్ష రూపాయల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. పూర్వకాలం నుంచి గ్రామ దేవతలుగా కొలువైన అమ్మవార్లను పూజించడం సంప్రదాయంగా వస్తుందని, గ్రామాల్లో ఏ శుభకార్యం నిర్వహించినా మొదటగా గ్రామ దేవతలను పూజిస్తామని చెప్పారు. దేవాలయాలను నిర్మించడమే కాకుండా నిత్యం దూపనైవేద్యాలను కొనసాగించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు శివకుమార్ రెడ్డి, ప్రవీణ్‌కుమార్, హరీశ్వర్‌రెడ్డి, రవి, మల్లారెడ్డి, శివకిరణ్‌రెడ్డి, అఖిల్ రెడ్డి పాల్గొన్నారు.

నారంజీకి నివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి

కేశంపేట: చనిపోయిన వ్యక్తిని కుటుంబ సభ్యులు గుర్తు పెట్టుకొని అతడి పేరుపై సేవలు చేయడం అభినందనీయమని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని లేమామిడిలో నిర్వహించిన నారంజీ రెండవ వర్ధంతికి ఎంపీ శ్రీనివారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు చీరలను పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీశైలం, జగత్‌రెడ్డి, బాలాజీ, కిషన్, జహంగీర్, హరికుమార్ పాల్గొన్నారు.

ఫోర్జరీతో భూమి రిజిస్ట్రేషన్

కేశంపేట: వారసత్వంగా రావాల్సిన భూమిని పోర్జరీ సంతకాలతో ఒక్కరే రిజిస్ట్రేషన్ చేసుకున్న ఘటనపై మండల పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సంతాపూర్‌కు చెందిన మాదారం నర్సింలుకు గ్రామ శివారులోని సర్వేనంబర్ 131లో ఎకరం లావాణీ భూమి ఉంది. నర్సింలు గత సంవత్సరం జనవరిలో మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులతో పాటు కూతురు ఉంది. చిన్న కుమారుడు పాండు మృతి చెందడంతో పెద్ద కుమారుడైన నర్సింలు తమ్ముడి కుటుంబ సభ్యులకు తెలియకుండా అక్క బాలమణి సంతకం పోర్జరీ చేసి భూమిని తన పేరుపై మార్చుకున్నాడు. ఈ విషయమై మృతి చెందిన పాండు కుమారుడు మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు.

అద్దె భవనాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు

- 8 పీహెచ్‌సీలకు రెండే పక్కా భవనాలు
- ఉచిత, అద్దె భవనాల్లో కొనసాగుతున్న సబ్‌సెంటర్లు
- ఇబ్బందుల్లో గర్భిణులు, బాలింతలు



లేమామిడిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం

కేశంపేట: ఆరోగ్య కేంద్రాలకు సొంత భవనాలు లేక పోవడంతో ఉన్న భవనాల్లో సరైన వసతులు లేక గర్భిణులు, బాలింతాల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీలకు మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, కొండారెడ్డిపల్లి, తొమ్మిదిరేకుల, వేములనర్వ, కేశంపేట, కొత్తపేట, ఎక్లాస్‌ఖాన్‌పేట, లేమామిడి గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో గర్భిణులు, బాలింతాలు, రోగులకు ఆరోగ్య సేవలను అందిస్తున్నారు.

అద్దె భవనాల్లో సౌకర్యాలు నిల్...

మండల పరిధిలోని 8 ఆరోగ్య ఉప కేంద్రాలకుగాను పాపిరెడ్డిగూడ, ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామాల్లో మాత్రమే వైద్యశాఖకు చెందిన సొంత భవనాలు ఉన్నాయి. కొత్తపేట, కేశంపేట ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. వేములనర్వ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం గ్రామ పంచాయతీ భవనంలో, తొమ్మిదిరేకులలోని ఉప కేంద్రం మహిళ సమాఖ్య భవనంలో కొనసాగుతున్నాయి. లేమామిడి, కొండారెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అద్దె భవనలతో పాటు ప్రభుత్వ భవనల్లో కూడా సరైన సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులను పడుతున్నట్లు పలువురు రోగులు తెలిపారు. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలకు సొంత భవనాలను మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

మండల పరిధిలోని 8 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలకు ప్రతిపాదనలు పంపించడం జరిగింది. ఇ ప్పటి వరకు ఎలాంటి సమాచారం రాలేదు. పాపి రెడ్డిగూడ, ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామాల్లో ఉన్న కేంద్రా ల్లో కూడా సౌకర్యాలను పెంచాలని ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించడం జరిగింది.

– డాక్టర్ నిఖిత మండల వైద్యాధికారి, కేశంపేట

కొత్త భవనాలను మంజూరు చేయాలి



సరైన సౌకర్యాలు లేని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలతో పాటు అద్దె భవనల్లో కొనసాగుతున్న వాటి స్థానంలో కొత్త వాటిని నిర్మించేందుకు భవనాలను ప్రభుత్వం వెంటానే మంజూరు చేయాలి. భవనాలతో పాటు సిబ్బంది కొరత కూడా ఉంది అధికారులు స్పందించి పనికి తగిన సిబ్బందిని నియమించాలి.

– భీమయ్య, బీఎస్పీ జిల్లా నాయకుడు, కేశంపేట మండలం

లీకేజీలతో తాగునీరు కలుషితం

పట్టించుకోని అధికారులు



లీకేజీలతో కలుషితమవుతున్న తాగునీరు

షాబాద్: గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే మిషన్ భగీరథ నీరు లీకేజీలతో కలుషితమవుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. గత 6నెలలుగా మండల కేంద్రంలో పైపులైన్ లీకేజీ అవుతుంది.. ముంబాయి– బెంగళూరు లింక్ జాతీయ రహదారి పక్కనే మిషన్ భగీరథ పైపులైన్ లీకై నీరంతా వృథాగా పోతుంది. పక్కనే మిషన్ భగీరథ తాగునీరు కలుషితమవుతున్న అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అదే విధంగా షాబాద్ ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో రహదారి పక్కన కూడా మిషన్‌భగీరథ నీరు లీకేజీ అవుతుందని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి లీకేజీలను అరికట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెస్తాం

పార్టీ నాయకుడు భీంభరత్



లోకసభ మాజీ స్పీకర్ మీరాకుమారికి స్వాగతం పలుకుతున్న భీంభరత్

షాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ మాజీ అధికార ప్రతినిధి పామెన భీంభరత్ అన్నారు. ఆదివారం శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో మాజీ లోకసభ స్పీకర్ మీరాకుమారికి స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం కులమతాల మధ్య చిచ్చుపెట్టి పరిపాలన సాగిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నియంత పాలన సాగుతుందని, నిత్యావసర సరుకుల ధరలు భగ్గుమంటున్నాయని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీతోనే అందరికి సరైన న్యాయం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ భార్గవ రామ్, మాజీ సర్పంచ్‌లు రవి, చెన్నయ్య, నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, సుదర్శన్, నర్సింహులు, రవీందర్, ప్రవీణ్, రాంచందర్, మహేందర్, ఆంజనేయులు తదితరులున్నారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని సందర్శించిన రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

మొయినాబాద్: కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం ఆదివారం ప్రభుత్వం నిర్వహించిన తుది రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మండల పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల, జేబీఐఈటీ, జేబీఆర్ఈసీ, వీజేఐటీ కళాశాలల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్ష జరిగింది. గంట ముందు నుంచే అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలోని ఐదు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 4700 మంది అభ్యర్థులకుగాను 4500 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాలను రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్ రెడ్డి సందర్శించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పర్యవేక్షించారు. ఆయన వెంట చేవెళ్ల ఏసీపీ ప్రభాకర్, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ డీకే లక్ష్మీరెడ్డి ఉన్నారు.

ట్రాఫిక్ జాంతో ఇబ్బందులు...

కానిస్టేబుల్ తుది రాత పరీక్ష సందర్భంగా పరీక్షకు వచ్చే అభ్యర్థులు ట్రాఫిక్ జాంతో ఇబ్బందులు పడ్డారు. ఉదయం పరీక్ష కేంద్రాలకు వచ్చేముందు అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్, జేబీఐఈటీ వద్ద ట్రాఫిక్ నిలిచిపోయి అభ్యర్థులతో పాటు స్థానికులు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అదే విధంగా మధ్యాహ్నం పరీక్ష పూర్తయిన తరువాత సైతం ట్రాఫిక్ ఇబ్బందులు తప్పలేదు.

ధ్యానంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న వెంకటలక్ష్మి

కొందుర్గు: ధ్యానంతో ఆరోగ్యం, మానసిక ప్రశాంతత చేకూరుతుందని ధ్యాన ప్రచారకర్త వెంకటలక్ష్మి సూచించారు. ఆదివారం జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని గుర్రంపల్లి, వీరసముద్రం, రావిర్యాల గ్రామాల్లో ధ్యానం అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి ధ్యానం వలన కలిగే లాభాల గురించి వివరించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. నిత్యజీవితంలో ధ్యానం అలవాటు చేసుకోవాలని, ప్రతిరోజు కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. ధ్యానం చేసేవారు శాఖాహారం తీసుకోవాలని, ధ్యానం చేయడం వల్ల భవిష్యత్‌లో ప్రాణాంతక వ్యాధులు రాకుండా జాగ్రత్త పడవచ్చన్నారు. కార్యక్రమంలో పిరమిడ్, స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి ఆంజనేయరెడ్డి, పిరమిడ్ సంస్థ సభ్యులు బాలకృష్ణారెడ్డి, తిరుపతయ్య, యాదయ్య పాల్గొన్నారు.

కిరణ్‌కుమార్‌కు సన్మానం



కిరణ్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

మొయినాబాద్: రాజేంద్రనగర్ మెట్రోపాలిటన్ కోర్టు బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీ కారుకొండ కిరణ్‌కుమార్‌ను ఆదివారం ఇండియన్ లీగల్ అడ్వకేట్ ప్రొఫెషనల్ అసోసియేషన్(ఐఎల్‌పీఏ) ఆధ్వర్యంలో సన్మానించారు. మహనీయులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను ఎల్బీనగర్‌లోని సమతా భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎల్‌పీఏ సభ్యుడిగా ఉండి బార్ అసోసియేషన్ లైబ్రరీ సెక్రటరీగా ఎన్నికైన సందర్భంగా కిరణ్‌కుమార్‌కు సన్మానం చేశారు. అదే విధంగా ఐఎల్‌పీఏ ద్వారా ఎన్నికైన జూనియర్ సివిల్ జడ్జీలకు, హైకోర్టు ఏజీపీగా నియమితులైన విష్ణువర్ధన్, బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఎన్నికైన న్యాయవాదులకు, ఫ్యాకల్టీకి సన్మానం చేశారు. కార్యక్రమంలో హైకోర్టు జడ్జీ జస్టిస్ సూరేపల్లి నంద, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ డైరెక్టర్ సుధారాణి, జర్నలిస్టు మల్లేపల్లి లక్ష్మయ్య, ఐఎల్‌పీఏ అధ్యక్షుడు పొన్నం దేవరాజుగౌడ్, సీనియర్ అడ్వకేట్‌లు సామ్‌సన్, వెంకట్ రెడ్డి, గంగిడు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

అవినీతి ఎమ్మెల్యేలను బహిష్కరించాలి

ఎమ్మార్పీఎస్ నాయకుడు శ్రీను



ధర్నాలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కేశంపేట: దళితబంధు పథకంలో అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల చిట్టా తన వద్ద ఉందన్న సీఎం కేసీఆర్ వారిని వెంటనే బహిష్కరించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు చిర్ర శ్రీను అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ.. దళితబంధు పథకంలో ఎమ్మెల్యేలు రెండు నుంచి మూడు లక్షల వరకు అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు ఉన్నాయన సీఎం కేసీఆర్ వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. దళితులకు దళితబంధు పథకంతో పది లక్షలు ఇస్తున్నామని చెప్తున్నా నాయకులు గ్రామానికి ఒక్కరికి కూడా ఇవ్వలేదన్నారు. బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపిన ఎస్సీలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోయారు. అవినీతికి పాల్పడిన ఎమ్మెల్యేల పైన చర్యలు తీసుకోకుంటే ఎమ్మార్పీఎస్ గౌరవ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కృష్ణయ్య, రాంచంద్రయ్య, మల్లయ్య, రాజు, చందు, శేఖర్, చింటూ, బన్ని పాల్గొన్నారు.

బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

ఆ పార్టీ నేత విజయ్‌కుమార్



పార్టీలోకి ఆహ్వానిస్తున్న విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్: బీజేపీతోనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని చిన్న చిలకమర్రి ఉప సర్పంచ్‌తో పాటు పలువురు ఆదివారం డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులను విడుదల చేసి అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. గ్రామాలతో పాటు రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కోరారు.

మాన్‌కీబాత్ వీక్షించిన నాయకులు

ప్రధానమంత్రి ప్రతి నెల చివరి ఆదివారం నిర్వహించే మాన్‌కీబాత్ కార్యక్రమాన్ని ఆదివారం షాద్‌నగర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు వీక్షించారు. 100వ మాన్‌కీబాత్ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు వీక్షించారు. కార్యక్రమంలో శ్రీవర్ధన్‌రెడ్డి, దేవల్లి అశోక్‌గౌడ్, అందె బాబయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, మిధున్‌రెడ్డి, వంశీకృష్ణ, శ్రీనివాస్, మోహన్‌సింగ్, రఘుగౌడ్, అకుల ప్రదీప్ పాల్గొన్నారు.

స్వరాజ్య సభకు తరలివెళ్లిన నాయకులు



హైదరాబాద్‌కు తరలివెళ్తున్న డీఎస్పీ నాయకులు

నందిగామ: హైదరాబాద్ సరూర్‌నగర్‌లోని ఇండోర్ స్టేడియంలో దళిత్ శక్తి ప్రోగ్రాం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహారాజ్ ఆధ్వర్యంలో ఆదివారం నందిగామ నుంచి డీఎస్పీ మండల కన్వీనర్ ఫకీరయ్య ఆధ్వర్యంలో పలువురు నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఫకీరయ్య మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీల రాజ్యస్థాపనకు డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ మార్చి 15న నాగర్ కర్నూల్ జిల్లాలో పాదయాత్ర ప్రారంభించారని చెప్పారు. పాదయాత్ర సుమారు 3 వేల గ్రామాల్లో కొనసాగిందని, ముగింపు సభ సరూర్‌నగర్‌లో నిర్వహిస్తున్నారని అన్నారు. ముగింపు సభను విజయవంతం చేయడానికి తరలివెళ్లున్నట్లు చెప్పారు. తరలివెళ్లిన వారిలో యాదగిరి, ప్రశాంత్, దీరా, నరేష్, జంగయ్య, ప్రవీణ్, నవీన్ తదితరులు ఉన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: దళితశక్తి ప్రోగ్రాం ఆధ్వర్యంలో విశారధన్ మహారాజ్ చేపట్టిన స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభకు ఆదివారం కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల నుంచి డీఎస్పీ నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా కొందుర్గులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి బయలుదేరారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, రవీందర్, సత్యం, రవికుమార్, సంజీవ్, రాములు, మల్లేష్ పాల్గొన్నారు.

ఘనంగా మల్లన్న జాతర



జాతరలో పాల్గొన్న అనితారెడ్డి, ఎమ్మెల్యే



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

శంకర్‌పల్లి: మల్లన్న జాతర ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గోపులారం గ్రామంలో నిర్వహించిన మల్లన్న జాతర ఉత్సవాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జాతర ఉత్సవాలను మరువకూడదని, గ్రామీణ ప్రాంతాల్లోని ఆచారాలను ముందు తరాలకు అందించాలని సూచించారు. అలాగే, బీజేపీ సీనియర్ నాయకులు వర్రి తులసీరాం విజయ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులు ఆయనను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తొండ మల్లమ్మ, మహారాజ్‌పేట్ మాజీ ఉప సర్పంచ్ రవి, నాయకులు లక్ష్మీనివాస్, సాయి, సర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మల్లన్న బోనాలు

కొందుర్గు: మండలంలోని ముట్పూర్‌లో ఆదివారం మల్లికార్జున స్వామి బోనాలను గ్రామస్తులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా మహిళలు అలంకరించిన బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి మల్లికార్జున స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

సీఎం కేసీఆర్‌ను కలిసిన ఎంపీ, ఎమ్మెల్యేలు



సీఎం కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి



ముఖ్యమంత్రికి పూలబొకేను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: రాష్ట్ర నూతన సెక్రటరియేట్ ప్రారంభోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్‌ను కలిసి చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం నూతన సెక్రటరియేట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న వారు ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1992–93లో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం పట్టణంలోని నాగులపల్లి రిసార్ట్‌లో పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. 30సంవత్సరాల తరువాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు ఒకరినొకరు ఎంతో ఆప్యాయంగా పలకరించుకున్నారు. యోగా, క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఇన్నేళ్ల తరువాత ఒకే వేదికపై కలుసుకొని అంతులేని ఆనందాన్ని పొందారు. ఉద్యోగాలు, వ్యాపారాలు, కుటుంబ బాధ్యతలతో తీరిక లేకుండా ఎక్కడెక్కడో ఉన్నప్పటికీ 30 ఏళ్ల అనంతరం బాల్య స్నేహితులను కలుసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

బూర్గులలో...

పట్టణంలోని ఫరూఖ్‌నగర్ ఉన్నత పాఠశాలలో 2002–2003 పదవతరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు కలుసుకొని ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

మహేందర్‌రెడ్డికి ఉత్తమ రైతు అవార్డు



ఏపీ మంత్రి అప్పలరాజు చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న మహేందర్‌రెడ్డి

చేవెళ్ల: ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు సంబంధించి గొర్రెలు, మేకల పెంపకంలో ఉత్తమ రైతుగా చేవెళ్ల ప్రాంతానికి చెందిన మూల మహేందర్‌రెడ్డి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ.. ఈ అవార్డు రావడం ఎంతో సంతోషంగా ఉందని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి తనను గుర్తించి ఉత్తమ రైతుగా ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రపంచ పశువైద్య దినోత్సవం సందర్భంగా శనివారం ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడలో నిర్వహించిన వేడుకల్లో డాక్టర్ సి.కె.రావు ఎండోమెంట్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో ప్రగతిశీల రైతులకు అవార్డులను స్పాన్సర్ చేసిందని చెప్పారు. ఈ అవార్డులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ అమరేంద్రకుమార్ చేతుల మీదుగా అందుకోవడం జరిగిందన్నారు. శంకర్‌పల్లి మండలం చందిప్ప గ్రామానికి చెందిన నేను చేవెళ్ల మండలంలోని సింగప్పగూడలో 2013 నుంచి ఎత్తయిన షెడ్‌ల్లో మేలు రకం జాతి మేకల పెంపకం చేస్తున్నట్లు తెలిపారు. అవార్డుకు ఎంపిక చేసిన అధికారులకు, నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మేకల పెంపకం చేసే వారికి కావాల్సిన సలహాలు, సూచనలు ప్రతి శనివారం తన మేకల ఫామ్ వద్దనే ఉచితంగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 2017లో భారత మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా రైతు నేస్తం అవార్డు అందుకున్నట్లు ఆయన తెలిపారు.